టంగ్ క్లీనర్‌తో దోచేస్తున్నారు

- కాకినాడ జ్యోతుల వీధి ప్రాంతంలో వరుస దొంగతనాలు
- అడ్డ గడియలు ఉన్న తలుపులు తెరిచి సొత్తు అపహరణ
- వారం వ్యవధిలో రెండుచోట్ల ఘటనలు

కాకినాడ క్రైం: కళల్లో చోరకళ అన్నది ఒకటని అందరికీ తెలిసిందే. ఎంత కళాత్మకంగా, ఎంత ప్రతిభావంతంగా.. ఎవరూ కనుగొనలేనంతగా పని ముగిస్తారన్నది చోరుడి కళా నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత సమాజంలో అటువంటి చోరకళా నిపుణులకు కొదవేమీ లేదు. దొంగా పోలీసు ఆటలో దొంగ ఎప్పుడూ ముందే ఉంటాడు. వారిని కనుగొనే ప్రక్రియలో పోలీసు ఎప్పుడూ వారి వెనకే ఉంటారు. కాలానుగుణంగా దొంగలు విధానాలు మార్చుకుంటూ ముందుకు సాగిపోతున్నారు. ఇదిగో ఈ చోర శిఖామణి సాహసం చూస్తే ఔరా అనకమానరు. కేవలం టంగ్ క్లీనర్‌నే పనిముట్టుగా చేసుకుని ఇళ్లను దోచేస్తున్నాడు. అర్ధరాత్రి దాటాక స్థానిక ఇళ్లలో బంగారం, డబ్బు చోరీకి గురవుతున్నాయి. నేరస్తుడిని చూసినా అతడే అనే గుర్తించలేక స్థానికులు వదిలేయడం పోలీసులకూ తల నొప్పిగా మారింది. చూసిన వారు 30 ఏళ్లలోపు యువకుడేనని చెబుతున్నారు. ఒకడేనా, సమూహమా అన్నదే అందరిలోనూ సందేహం

టంగ్ క్లీనర్‌తో ఎలా...

నేరస్తుడు దొంగతనానికి టంగ్ క్లీనర్‌ని ఉపయోగిస్తున్నాడని పోలీసులు గుర్తించారు. కాకినాడ జ్యోతుల వీధిలో పాత కాలం ఇళ్లు ఎక్కువగా ఉన్నాయి. గడియలు కూడా సునాయాసంగా తీయగలిగే గత కాలం నాటి నిర్మాణాలను తనకు అవకాశంగా మలుచుకుంటూ టంగ్ క్లీనర్ వినియోగించి సొత్తు కొల్లగొడుతున్నాడు. రెండు తలుపుల మధ్య ఉండే ఖాళీ నుంచి టంగ్ క్లీనర్‌తో అడ్డ గడియను పైకెత్తి తీసి లోపలికి ప్రవేశిస్తాడు. అప్పటికే గాఢనిద్రలో ఉన్న ఇంటివారి మెడల్లో బంగారం, బీరువా తాళాలు దొరికితే అందిన కాడికి దోచేసి వెళ్లిపోతాడు.



దొంగతనాలు చోటు చేసుకున్న కాకినాడలోని జ్యోతుల వీధి



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న క్రైం సీఐ కృష్ణ బృందం



దొంగను చూసిన అవ్వ నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వారంలో రెండు దొంగతనాలు...

కేవలం వారం రోజుల వ్యవధిలో జ్యోతుల వీధిలో ఈ తరహా దొంగతనాలు రెండు జరిగాయి. ఒక చోరీలో బంగారం, డబ్బును ఎత్తుకెళ్లిన దొంగ, మరో చోరీలో మహిళ మెడలో తాడు, సూత్రాలు తెంపేసి తీవ్రకు వెళ్లిపోయాడు. తొలి దొంగతనం ఓ వ్యాపారి ఇంట్లో, రెండోది కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఇంట్లో జరిగాయి.

సీసీ కెమెరాలు లేని ఇళ్లే లక్ష్యం

సీసీ కెమెరాలు లేని ఇళ్లే లక్ష్యంగా దొంగ తన ప్రణాళిక అమలు చేశాడు. ఇటీవల దొంగతనం జరిగిన రెండు ఇళ్ల ఆవరణల్లోనూ సీసీ కెమెరాల నిఘా లేదు.

ఓ అనుమానితుడు..

సుమారు వారం రోజుల క్రితం ఇదే దొంగ తలుపు దగ్గరగా వేసి ఉన్న ఓ ఇంట్లోకి చొరబడ్డాడు. ఆ ఇంట్లో ఓ అవ్వ నిద్రిస్తోంది. ఆమె గదిలోకి వెళ్లి ఆ గది నుంచి పక్క గదికి వెళ్లేందుకు తలుపు తీయాలని యత్నించాడు. తన వద్ద ఉన్న టంగ్ క్లీనర్‌తో గడియ తీస్తుండగా అవ్వకు మెలుకువ వచ్చి ఆగంతకుడిని చూసి కంగారు పడి కేకలు వేసే సరికి పరారయ్యాడు. ఆ వ్యక్తి వయసు సుమారు 25–30 ఏళ్ల మధ్య ఉంటుందని ఆమె పోలీసులకు తెలిపింది. సుమారు మూడు గంటల సమయంలో జరిగిన అదే రోజు కొద్ది సేపటికే జీజీహెచ్ ఉద్యోగి ఇంట్లో దొంగతనం జరిగింది. ఇళ్లల్లోకి చొరబడి నిద్రిస్తున్న మహిళల మెడ నుంచి బంగారు గొలుసులు కోసుకెళ్లిన ఈ తరహా దొంగతనం ఇదే తొలిసారని సీఐ కృష్ణ తెలిపారు.



దొంగతనం చోటు చేసుకున్న ఓ ఇంట్లో తలుపు (అంతర చిత్రం) నిందితుడు దొంగతనానికి వినియోగించిన టంగ్ క్లీనర్

పోలీసుల తనిఖీలు

దొంగతనాలు జరిగిన ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబీకులతో పోలీసులు మాట్లాడారు. త్రీ టౌన్ క్రైం సీఐ వి.కృష్ణ ఆధ్వర్యంలోని క్రైం బృందం విస్తృత తనిఖీలు చేపట్టింది. అనుమానితులను చూసిన వారిని ఆరా తీస్తున్నారు. ఇళ్ల ఆవరణల్లో సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేయించుకోవాలని, బలహీనంగా ఉన్న తలుపులు, కిటికీలతో అప్రమత్తంగా ఉండాలని క్రైం సీఐ కృష్ణ, ఏఎస్ఐ గోవిందరావు బృందం నిర్వాసితులకు సూచించింది.

క్లుప్తంగా

వచ్చేనెల 7న వెయ్యి గొంతులు-లక్ష డప్పులు



వెయ్యి గొంతులు-లక్ష డప్పులు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కరప: ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చాట్ల ఇమ్మాన్యుయేలు, కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తాతపూడి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక పీహెచ్‌సీకి ఎదురుగా ఉన్న మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద గురువారం సమితి నాయకులు హైదరాబాద్‌లో వచ్చే నెల 7న జరిగే వెయ్యి గొంతులు-లక్ష డప్పుల కార్యక్రమం కరపత్రాలను వారు ఆవిష్కరించారు. సుప్రీం తీర్పు మేరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రిజర్వేషన్ అమలుచేయాలని కోరుతూ మాదిగలు, డప్పు కళాకారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం ఇవ్వడంపై హర్షం వ్యక్తంచేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు సవరపు చినసత్తిరాజు, డప్పుకళాకారుల సంఘం అధ్యక్షుడు మందపల్లి దేవానందం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: వార్షిక మరమ్మతుల నిమిత్తం వాకలపూడి సెక్షన్ తిమ్మాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలియజేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాయుడుపాలెం, కొత్తూరు, కొత్తూరు జంక్షన్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని గురువారం కోరారు.

కరపలో..

కరప: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ సంస్థ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కరప, శివారు పేపకాయలపాలెం, పెనుగుదురు గ్రామంలో కొంతభాగం విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

కూలీలందరికీ ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు

కరప: గ్రామాల్లోని కూలీలందరికీ పని కల్పించి, రోజువారీ వేతనం రూ.300 వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ కోరారు. స్థానిక మెరకవీధి రామాలయం వద్ద గురువారం ఉపాధి పథకం వేతనదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి పథకం వేతనదారులతో సమావేశం నిర్వహించి, మేట్లను ఎంపిక చేయాలన్నారు. వేతనదారుల సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు చోడిశెట్టి కృష్ణ, మందనక్క జగ్గారావు, దేవు వెంకటరమణ, పేపకాయల వెంకట్రావు, నున్న చంద్రరావు, మేడిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కొత్తపల్లి: ప్రస్తుతం సమాజానికి సమస్యాత్మకంగా పరిణమించిన సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక వీవీఎస్ కళాశాల విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెల్‌ఫోన్ వినియోగం, సోషల్ మీడియా వంటి సాంకేతికతను సక్రమ మార్గంలో వినియోగించాలన్నారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం గణనీయంగా పెరగడంతో ఇటీవల సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారన్నారు. డిజిటల్ అరెస్టులంటూ ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని చెప్పారు. పోలీసు చట్టంలో డిజిటల్ అరెస్టు ప్రస్తావనే లేదన్నారు. సంబంధం లేని యాప్‌లు, ఫోన్లకు వస్తున్న ఓటీపీల జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. వివిధ కోణాల్లో ఆశ చూపించి ప్రజలను మోసగించేందుకు యత్నిస్తున్న సైబర్ నేరగాళ్ల ఆగడాలపై అత్యంత జాగురుకతగా ఉండాలని సూచించారు. మహిళల సంరక్షణ, భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ఇళ్లలో చోరీల నివారణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనిని హెచ్చరించారు.

పారిశుధ్య పనుల తనిఖీ



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ భావన

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్ భావన గురువారం పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రమణయ్యపేట, కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్లను సందర్శించి పారిశుధ్య పనుల నిర్వహణను పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం వెహికల్ యార్డులో హూపర్ టిప్పర్ వాహనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆమె వెంట ఉన్నారు.

వయో వృద్ధులకు కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి

కాకినాడ రూరల్: వచ్చే నెల 1న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో 60 ఏళ్లు దాటిన వృద్ధులకు రాయితీలు కల్పించి ప్రాధాన్యం నివ్వాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్లకు ఆర్థిక భద్రతతో పాటు సామాజిక మద్దతు అవసరమన్నారు. 70 ఏళ్లు దాటిన పింఛనుదారులకు ఆదాయ పన్ను మినహాయించాలని, 60 ఏళ్లు పైబడిన పింఛను దారులకు ఆదాయంలో 50 శాతం రాయితీ ఇవ్వాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రోబోరోర్జ్‌లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థుల బృందం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సింగపూర్ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ రోబోరోర్జ్ పోటీల్లో తమ కళాశాల డిగ్రీ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆదిత్య డిగ్రీ కళాశాల కార్యదర్శి ఎస్.సుగుణారెడ్డి గురువారం తెలిపారు. స్మార్ట్ కోడింగ్ విభాగంలో ద్వితీయ స్థానం, స్మార్ట్ రోబోటిక్ విభాగంలో మూడో స్థానం సాధించి అంతర్జాతీయంగా ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు తెచ్చారన్నారు. డిగ్రీ విద్యార్థుల బృందం ఉప్పాల సునీత సాయి, పిల్లి లోహిత, సుహేలీ మహాపాత్ర ఈ విజయం సాధించారన్నారు. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

బాలాజీచెరువు: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకోవాలని ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా రాజరాజేశ్వరి ఐటీఐ ప్రిన్సిపాల్ బాల గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్-1 సీఐ ఎస్.రమేష్ మాట్లాడుతూ వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్సై కె.అప్పారావు, విద్యార్థులు, ఐటీఐ అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్‌ను బాధ్యతగా భావించండి



హెల్మెట్ వినియోగంపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవాణాశాఖ కమిషనర్ శ్రీధర్, మెడికవర్ ఆస్పత్రి వైద్యులు, యూనిట్ హెడ్ శుభాకరరావు

- ప్రమాదాలు జరిగితే మొదటి గంటే కీలకం
- ప్రాణాలు కాపాడేందుకు అందరూ సహకరించండి
- రవాణా శాఖ కమిషనర్ శ్రీధర్

కాకినాడ రూరల్: రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట చాలా కీలకమని, దానినే గోల్డెన్ అవర్ అంటారని, ప్రాణాలు కాపాడేందుకు, ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రవాణా శాఖ కమిషనర్ శ్రీధర్ పేర్కొన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేయడం మనందరి బాధ్యత అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు మెడికో లీగల్ కేసులో భాగంగా పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది ఇబ్బంది పెడతారనే భయంతో చాలా మంది సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారన్నారు. రహదారి ప్రమాదాల్లో సహాయం చేసే వారికి రక్షణ కల్పించడానికి భారత ప్రభుత్వం నూతన చట్టాన్ని తెచ్చిందన్నారు. రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేసే వ్యక్తులకు గౌరవ సూచకంగా సంబంధిత జిల్లా కలెక్టర్ రూ.5 వేల వరకు పారితోషకం మంజూరు చేస్తూ వారి సేవలకు గుర్తిస్తూ యోగ్యతా పత్రం కూడా ఇస్తారన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు, వైద్యులు జయప్రకాష్, పద్మావతి, గౌతమ్ రామ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ల వినియోగంపై కమిషనర్ శ్రీధర్, సంస్థ వైద్యులు, యూనిట్ హెడ్ శుభాకరరావు పోస్టర్ ఆవిష్కరించారు.

సమరసత సభ్యత్వాలు చేయించాలి



సభ్యత్వ నమోదు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా ధర్మ ప్రచారక్ రఘు

కరప: సమరసత సేవా ఫౌండేషన్ సభ్యత్వాలు అధిక సంఖ్యలో చేయించాలని ఆ సంస్థ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు సూచించారు. దేశంకోసం, ధర్మంకోసం పని చేసే సంస్థలను ప్రోత్సహించాలని హిందూ సోదరులను కోరాలన్నారు. స్థానిక నీలయ్యతోటవీధిలో గురువారం 2025 విశ్వావసు నామసంవత్సరం డైరీలు, సమరసత సేవాఫౌండేషన్ సభ్యత్వ నమోదు కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఫిబ్రవరి 8వ తేదీ భీష్మ ఏకాదశి నుంచి 26వ తేదీ మహాశివరాత్రి వరకు సభ్యత్వ నమోదు జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా 20 వేల మందిని సభ్యులుగా చేర్చాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ పేకేటి లక్ష్మీకాంతం, యానాం ఖండ కన్వీనర్ ముమ్మిడి చంటిబాబు, మండల కన్వీనర్ కాదా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో యువతకు శిక్షణ



మూలపేటలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్న నిపుణులు

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలో ఉన్న ప్రతిభ కేంద్రంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. బీటెక్, బీఎస్సీ, బీకామ్ వంటి డిగ్రీలు పూర్తి చేసిన నిరుద్యోగులకు స్పోకెన్ ట్యుటోరియల్ ఐఐటీ సిబ్బందితో జావా, పైథాన్, హెచ్‌టీఎంఎల్, ఆర్‌డీఎంఎస్, జావా స్క్రిప్ట్, సీఎస్ఎస్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య దయానంద్ మాట్లాడుతూ, ఇటువంటి శిక్షణ తరగతులను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన శిక్షణ పొందితే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ, ఏటా తమ ఫౌండేషన్ ద్వారా సుమారు 200 మంది నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

కంటి చూపుపై నిర్లక్ష్యం వద్దు



వైద్య శిబిరాన్ని సందర్శించిన నగరపాలక సంస్థ కమిషనర్ భావన

కాకినాడ: కంటిచూపుపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా స్థానిక కొండయ్యపాలెంలోని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కమిషనర్ భావన పరిశీలించారు.

శిబిరంలో నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది, ఇతర ఉద్యోగులకు కంటి పరీక్షలు చేశారు. ఆర్ఎస్ హాస్పటల్, ఆప్టిక్స్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. అవసరమైన వారికి సబ్సిడీపై కళ్లజోళ్లు అందజేశారు. సుమారు 132 మందికి వైద్య పరీక్షలు చేయించారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

బోట్‌క్లబ్: భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బాలాజీచెరువు సెంటర్ వరకూ ఈ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వివిధ కళాశాలల విద్యార్థులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ

బోట్‌క్లబ్: కాకినాడ క్వీన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం జూనియర్ చాంబర్ ఇంటర్నేషన్ కాకినాడ అధ్యక్షురాలు మాటూరి శ్రీప్రియ నగరంలోని పలు ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. సభ్యులు ప్రవల్లిక, వైదేహి సౌజన్యంతో నూతన వస్త్రాలు పంపిణీ చేశామన్నారు. క్వీన్స్ సభ్యులు తుమ్మల పద్మజ, లిఖిత పాల్గొన్నారు.

జాతిపితకు నివాళులు



గాంధీ విగ్రహానికి నూలు దండ వేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

కాకినాడ రూరల్: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కాకినాడ రూరల్‌లో నివాళులు అర్పించారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో గాంధీజీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ కమలకుమారి, అధ్యాపకులు నివాళులర్పించారు.

రమణయ్యపేటలో ఐడీఏ ఆధ్వర్యంలో సంఘం కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, డాక్టర్ శ్రీవల్లి గాంధీజీకి నివాళులర్పించారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏపీఐఐసీ కాలనీలో విశ్రాంత ఉద్యోగులు ప్రసాద్ నాయుడు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, పార్థసారథి, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

గాంధీభవన్‌కు సహకారం అందిస్తా

బోట్‌క్లబ్: గాంధీ భవన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని జేసీ రాహుల్‌మీనా అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక వెంకటరత్నపురంలోని గాంధీభవన్‌లో ఆయన విగ్రహానికి నూలు దండ వేసి నివాళి అర్పించారు. గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ గాంధీభవన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను జేసీకి వివరించారు. గాంధీభవన్ ప్రాంగణంలో ఉన్న ఉన్నతి సంస్థ ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఆయన జేసీ పరిశీలించి తన తరపున, ప్రభుత్వం తరపున తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రొఫెసర్ జోసెఫ్ స్టీఫెన్, కె.హరిబాబు, ప్రొఫెసర్ రాధా మాధవితో ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ విద్యార్థులు గాంధీభవన్‌ను సందర్శించి గాంధీజీ జీవిత విశేషాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్‌వీఎస్ మూర్తి, ఆర్‌పి రావు, ఎంవీ భరతలక్ష్మి, కాదా వెంకటరమణ, ఆలపాటి శ్రీనివాస్, ఐ.దోసగిరిరావు, అల్లూరి సురేంద్ర పాల్గొన్నారు.



కాకినాడ రమణయ్యపేటలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న వైద్యులు అడ్డాల



నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో గాంధీజీకి ప్రిన్సిపాల్ కమలకుమారి తదితరుల నివాళి



అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

గౌతమీ ఎక్స్‌ప్రెస్‌లో బంగారు ఆభరణాల చోరీ

సామర్లకోట: గౌతమీ ఎక్స్‌ప్రెస్‌లో బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు స్థానిక రైల్వే పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. లింగంపల్లి నుంచి సామర్లకోట వస్తున్న రైలులో సామర్లకోటకు చెందిన చక్రవర్తులు షణ్ముఖరాణి ప్రయాణించారు. లింగంపల్లిలో బుధవారం రాత్రి రైలు ఎక్కి సామర్లకోట రైల్వే స్టేషన్‌లో దిగిన తరువాత బ్యాగ్ చూడగా బంగారు గాజులు కనిపించక పోవడంతో ఆందోళనకు గురై జీఆర్పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.